

బత్తలపల్లిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ముదిగుబ్బలో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో పాల్గొన్న అశేష జనవాహినిలో ఒక భాగం

జయహో జగన్..

- 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు విశేష ఆదరణ
- రోడ్‌షోలో ఊరూరా ఎగసిపడిన అభిమాన తరంగం
- నృత్యాలు చేస్తూ.. పూలు చల్లుతూ స్వాగతించిన మహిళలు

బత్తలపల్లి/ముదిగుబ్బ: జన సంక్షేమ ప్రదాత జగన్ మోహన్‌రెడ్డికి ధర్మవరం నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రైతులు, కూలీలు, విద్యార్థులు, యువకులు, వృద్ధులు, వ్యాపారులు, వృత్తిపని వారు ఇలా అన్ని వర్గాల ప్రజలూ తమ అభిమాన నేతను చూసేందుకు కదిలి వచ్చారు. భగభగమని మండుతున్న ఎండల నుంచి శరీరాన్ని నీటితో చల్లబరచుకుని మరీ ఆయనను ప్రత్యక్షంగా చూసి ఆత్మీయంగా పలకరించి పులకరించిపోయారు. కనుచూపు మేర కిలోమీటర్ల బారులుదీరి తన కోసం ఎదురు చూస్తున్న ప్రజల అభిమానానికి సీఎం జగన్ ముగ్ధులయ్యారు. చెరగని చిరునవ్వుతో ప్రతి ఒక్కరి వైపూ చూస్తూ ముందుకు సాగారు. అనంతపురం జిల్లా నుంచి సంజీవపురం చేరుకున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శనివారం రాత్రే శ్రీసత్యసాయి జిల్లాలోకి అడుగుపెట్టింది. యాత్రకు ఆదివారం విరామం ఇచ్చారు. సోమవారం ఉదయం 10.20 గంటలకు సంజీవపురం విడిది కేంద్రం వద్ద నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు ఇతర నాయకులతో కలిసి ముఖ్యమంత్రి బస్సులో బయలుదేరారు. రాఘవంపల్లి, లింగారెడ్డిపల్లి బస్‌స్టాప్, బత్తలపల్లికి చేరుకున్నారు. అక్కడ ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూల వర్షం కురిపించారు. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిపై యుద్ధానికి మేమంతా సిద్ధం అంటూ కేరింతలు కొట్టారు. జగన్నినాదంతో బత్తలపల్లి కూడలి ప్రతిధ్వనించింది. అక్కడ 20 నిమిషాలపాటు రోడ్‌షో కొనసాగింది. ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి దంపతులు క్రేన్ సాయంతో భారీ గజమాలతో సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. అదేవిధంగా కొద్ది దూరంలో మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి భారీ గజమాలతో స్వాగతం పలికారు. రోడ్ షోలో ఆద్యంతం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వేలు తిప్పుతూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అక్కడి నుంచి గుమ్మల్లకుంట, తంబాపురం, జ్వాలాపురం, కోడేకండ్ల, రామాపురం, ఉప్పర్లపల్లి, దంపెట్ల, కట్టకిందపల్లి, డి.చెర్లోపల్లి, సూర్యచంద్రాపురం, నల్లబోయనపల్లి గ్రామాలలో దారిపొడవునా మహిళలు మంగళహారతులు పట్టారు. పూలతో స్వాగతం పలికారు. నృత్యాలు చేస్తూ, కేరింతలు కొట్టారు.



తంబాపురం వద్ద నృత్యాలు చేస్తున్న మహిళలు

- ఇక ముదిగుబ్బ మండలంలో సీఎం జగన్‌కు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. రాళ్లనంతపురం క్రాస్ వద్ద చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జొన్నలకొత్తపల్లి, కృష్ణాపురం క్రాస్, సంకేపల్లి వద్ద అధిక సంఖ్యలో ఉన్న జనవాహినిని చూసి సీఎం బస్సు దిగి అభివాదం చేశారు. ఎన్ఎస్‌పీ కొట్టాల, మల్లమ్మకొట్టాల మీదుగా మలకవేమల క్రాస్‌కు చేరుకున్నారు. నాగారెడ్డిపల్లి బ్రిడ్జి వద్ద గ్రామస్తులు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం కదిరి నియోజకవర్గంలో బస్సు యాత్ర సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి నారాయణరెడ్డి, కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు క్రిష్టమ్మ, వెంకటరెడ్డి, జెడ్పీటీసీ తిరుమలాబాయి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రాయుడు, భాస్కర్, లోకేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సేవేనాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



అప్పరాచెరువు మహిళల ఆనంద పరవశం



బత్తలపల్లిలో మిద్దెలపై నుంచి తిలకిస్తున్న ప్రజలు



తనకల్లు మండల పరిధిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



నల్లచెరువులో సీఎం జగన్‌ను చూసేందుకు వచ్చిన జనం

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

అమడగూరు: మండలంలోని చినగానిపల్లి, నరసన్నగారిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ప్రచార కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఫ్యాను గుర్తుకు ఓటేయండి

కొత్తచెరువు: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా రానున్న ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి తెలిపారు. సోమవారం కొడపగానిపల్లి పంచాయతీలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పర్యటించారు. అవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాల లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించి ఓటు అడగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ అలివేలమ్మ, సింగిల్‌విండో అధ్యక్షులు రఘునాథరెడ్డి, ఎంపీటీసీ వరలక్ష్మి, నాయకులు రాఘవరెడ్డి, నరసింహారెడ్డి, చౌరెడ్డి, కేశవ, మారుతి, శ్రీనివాసులు, సురేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, రాము, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం



గణేష్ సర్కిల్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ

పుట్టపర్తి రూరల్: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో పోలీసులు వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. సోమవారం సాయంత్రం సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి ప్రశాంతి గ్రాం, కర్నాటక నాగేపల్లి బ్రిడ్జి, ఎనుములపల్లి గణేష్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గంగన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యాన సాధనతోనే ఏకాగ్రత



ధ్యాన సాధన గురించి వివరిస్తున్న విజయలక్ష్మి

బత్తలపల్లి: విద్యార్థులు ఏకాగ్రత కోసం ధ్యాన సాధన చేయాలని వైజాగ్ పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ మూమెంట్ సంస్థ సభ్యురాలు విజయలక్ష్మి సూచించారు. సోమవారం బత్తలపల్లిలోని శ్రీజ్యోతి హైస్కూల్‌లో 'అధ్యాత్మిక ధ్యానం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ధ్యాన సాధనతో శరీరం, బుద్ధి, మనస్సును అదుపులో ఉంచుకోవచ్చునన్నారు. చదివిన అంశాలను ఎక్కువ రోజులు గుర్తుంచుకోవడానికి ధ్యానం సహాయపడుతుందని ప్రధానోపాధ్యాయుడు మిడతల లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగపెద్దిరాజు, వెంకటపతి, శంకరయ్య, రాజశేఖర్, కాటమయ్య, రమేష్, లక్ష్మి, ధనలక్ష్మి, షమిల, షబానా తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన కనపడలేదా..?



బీడుపల్లిలో ముసుగు వేయని శిలాఫలకం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీలో టీడీపీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అధికార వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రి ఫొటోలు ఉన్న అభివృద్ధి శిలాఫలకాలు, బోర్డులు, ఫ్లెక్సీలకు అధికారులు ముసుగులు వేశారు. మున్సిపాలిటీ 17వ వార్డు బీడుపల్లి ఎస్సీ కాలనీలోకి వెళ్లే రహదారిలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శిలాఫలకానికి ముసుగులు, స్టిక్కర్లు ఏవీ వేయలేదు. టీడీపీ వారి విషయంలో కోడ్ ఉల్లంఘన అధికారులకు ఎందుకు కనిపించడం లేదు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కోడ్‌ను పారదర్శకంగా అమలు చేయాలని కోరుతున్నారు.

ఘనంగా కోటి బాబు పుట్టినరోజు వేడుకలు



కోటి బాబు చిత్రపటంతో కార్యకర్తల హంగామా

బత్తలపల్లి: ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు (కోటి బాబు), ఉప సర్పంచ్ కోటి గోపీనాథ్‌ల పుట్టినరోజు వేడుకలు సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. బత్తలపల్లిలో జెడ్పీటీసీ కోటి సుధతో కలిసి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేక్ కట్ చేశారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

- డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సీఎం జగన్ బత్తలపల్లిలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి వెళ్లారు. ఈ సందర్భంగా తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో నవరత్నాల పథకాల ద్వారా ప్రజల ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగుపడిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థతో సామాన్య ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందాయన్నారు. వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సామాజిక భద్రత పింఛన్లు అందించడం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. చంద్రబాబు అండ్ కో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్ల సేవలను అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు. వారి దుర్మార్గపు చర్యలతో పింఛన్ కోసం వృద్ధులు, వికలాంగులు గ్రామ సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జొల్లిరెడ్డి అశ్వర్థ, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు పొరాళ్ల విజయభాస్కర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్లు మల్లప్పగారి మాధవరెడ్డి, అల్లే సాయినాథ్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, నాయకులు బండారు పెద్ద ఓబిలేసు, సల్లాపురం బాలరమణారెడ్డి, మదమంచి మల్లికార్జున నాయుడు, బాలకృష్ణారెడ్డి, మారక శివారెడ్డి, సిద్దే ఆదిరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ తరఫున ప్రజలే స్టార్ క్యాంపెయినర్లని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి భార్య దుద్దుకుంట అపర్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి మున్సిపాలిటీలో 17వ వార్డు బీడుపల్లిలో ఆమె గడప గడపా తిరుగుతూ జగనన్న అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయిలీలారెడ్డి, ఎన్నికల పరిశీలకులు నాగభూషణ, డాక్టర్ గోపాల్‌రెడ్డి, అవుటాల రమణారెడ్డి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మాజీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు రుషికేశవరెడ్డి, నాయకులు చింతా శ్రీధర్‌రెడ్డి, దాసిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, రంగప్ప, ఈశ్వరప్ప, డీలర్ మురళీకృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సధీర్‌రెడ్డి, ఓబుళరెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత సూర్యాగౌడ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి అపర్ణారెడ్డి

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

అమడగూరు: ఫ్యాను గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్సార్‌సీపీనే గెలిపించుకుందామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జౌకలకొత్తపల్లి, ఇద్దేవాండ్లపల్లిలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా చేయడంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కృషి మరువలేనిదన్నారు. నియోజకవర్గంలో మూడు జాతీయ రహదారులు రావడంలోను, 20 వేల జగనన్న ఇళ్ల నిర్మాణాలు సాగుతుండటంలోనూ ఎమ్మెల్యే చొరవ ఉందన్నారు. జనరంజక పాలన కోసం వైఎస్సార్‌సీపీకి మరోమారు అధికారంలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భర్త శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, సొసైటీ ప్రెసిడెంట్ బొట్టుస్వామి, సర్పంచ్ నరసమ్మ, ఎంపీటీసీ జయమ్మ, నక్కలచిన్నప్ప, నాగరాజు, లక్ష్మి, రాజన్న, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చౌడప్ప, రమేష్, ఆచారి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న దుద్దుకుంట కిషన్‌రెడ్డి

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

కనగానపల్లి: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న తమపై ప్రతిపక్ష టీడీపీ నాయకులు కక్ష కట్టి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దుర్మార్గమని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ముక్తాపురం, మామిళ్లపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన 18 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ముక్తాపురం గ్రామ సచివాలయం వద్ద కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ కూటమికి తొత్తుగా మారిన నిమ్మగడ్డ రమేష్ ద్వారా తమపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయించారన్నారు. దీంతో ఎన్నికల కమిషన్ తమ సేవలపై ఆంక్షలు విధించిందన్నారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు శారద, సురేష్, చంద్రకళ, వరలక్ష్మి, కుసుమ, సుస్మిత, అశోక్, మారుతి, రాజకుమార్‌రెడ్డి, మమత, కిరణ్, ఆది, తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: తమ సేవలు అడ్డుకుంటున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్తారని వలంటీర్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ వలంటీర్ల సేవలపై ఆంక్షలు విధించడంతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలు అందజేసినట్లు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తెలిపారు.



కనగానపల్లి: ముక్తాపురం సచివాలయం వద్ద రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

వలంటీర్ రాజీనామా

అమడగూరు: మహమ్మదాబాద్‌కు చెందిన వలంటీర్ హసన్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. తనకు వైఎస్సార్‌సీపీ అంటే చాలా అభిమానమన్నారు. వైఎస్ జగన్‌ను రెండోసారి సీఎంగా చూడడం, ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించుకోవడం కోసం ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు తాను వలంటీర్ పోస్టుకు రాజీనామా చేశానని చెప్పారు. ఈ మేరకు సోమవారం సచివాలయానికెళ్లి పంచాయతీ కార్యదర్శికి రాజీనామా లేఖ అందజేశానన్నారు.

పది పరీక్షల నిర్వహణ భేష్



ఆర్జేడీ రాఘవరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

పుట్టపర్తి: జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణ భేషుగ్గా జరిగిందని వైఎస్సార్‌టీఏ హర్షం వ్యక్తం చేసింది. సోమవారం వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈఓ మీనాక్షి, ఏడీలు నాగరాజు, రామకృష్ణ, లాజర్, డీసీఈబీ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, డీఈఓ కార్యాలయ సిబ్బంది పరీక్షల నిర్వహణకు, విద్యార్థులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలను కల్పించడంలో కృషి చేశారన్నారు. మూల్యాంకనం కూడా ఎలాంటి సమస్యలు లేకుండా తగిన సౌకర్యాలతో విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్జేడీ రాఘవరెడ్డిని సత్కరించారు.

చలివేంద్రం ప్రారంభం

ఎన్పీకుంట : మండల కేంద్రంలోని నాగుల కట్టవద్ద పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ నరేంద్ర కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, వీఆర్వోలు రఘు, క్రిష్టప్ప పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భూ సర్వే తహసీల్దార్ సునీత, సీఎస్‌డీటీ శారద, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, జూనియర్ అసిస్టెంట్ రామాంజినమ్మ, వీఆర్‌ఓలు రాణాప్రతాప్, మణికంఠ, వీఆర్ఏలు పాటు తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ డ్రైవర్ మృతి

ముదిగుబ్బ: దొరిగిల్లు ఘాట్ రోడ్డులో సోమవారం క్రేన్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. మృతుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన వాడిగా గుర్తించారు. క్రేన్ యజమాని అందుబాటులో లేకపోవడంతో మృతుని వివరాలు తెలియలేదు. పులివెందుల నుంచి ముదిగుబ్బ వైపు వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నీటి కొరత రాకుండా ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్

ధర్మవరం అర్బన్: పట్టణంలో నీటి కొరత రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు. కౌన్సిల్ హాల్‌లో సోమవారం సచివాలయ కార్యదర్శులు, వాటర్ సప్లయ్ సిబ్బంది, అధికారులు, ఇంజినీరింగ్ విభాగపు అధికారులు, సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డుల్లో ఎక్కడా నీటి కొరత రాకూడదన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని రెండురోజులకు ఒకసారి కూడా నీటిని వదలాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఈఈ సత్యనారాయణ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

ధర్మవరం అర్బన్: విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నామని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర తెలిపారు. పట్టణంలో సోమవారం పీఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడితో పాటు నాయకులు నందకిషోర్, హరి, ఆనంద్, వినోద్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ

రామగిరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి పలు వస్తువులు చోరీకి గురయ్యాయి. ఆ పాఠశాల సిబ్బంది సోమవారం ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. పాఠశాల తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు అందులో రూ.లక్షకు పైగా విలువ చేసే టీవీతో పాటు బియ్యం బస్తాలను ఎత్తుకెళ్లారు. పాఠశాల సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

అనాథలకు వస్త్రదానం

ముదిగుబ్బ: గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు సోమవారం రంగన కుటుంబ సభ్యులు వస్త్రదానంతో పాటు అన్నదానం చేశారు. రంగన చౌడప్ప, రంగన విజయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రంగన మనోజ్ కుమార్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కదిరి అర్బన్: స్థానిక భవితా కేంద్రంలో సోమవారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా సమన్వయకర్త ఆనంద్‌బాబు, మండల విద్యాధికారి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆడియాలజిస్ట్ తిరుమలేష్, ఆర్థో డాక్టర్ లక్ష్మీరామ్, సైకాలజిస్ట్ రాణెమ్మ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

రెమ్యునరేషన్ బకాయిలు చెల్లించాలి

కొత్తచెరువు: ఉపాధ్యాయులకు గత ఏడాది పదో తరగతి మూల్యాంకన రెమ్యునరేషన్ బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓ మీనాక్షికి వినతిపత్రం అందజేశారు.